క్లుప్తంగా

బస్ షెల్టర్ ప్రారంభం

రెంటచింతల: బస్‌షెల్టర్ నిర్మించడం అభినందనీయమని ఎంపీడీఓ కె.సరోజినిదేవి పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ వద్ద యర్రబోతుల శ్రీనివాసరావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ప్రవీణ్ కుమార్ రూ.2.50 లక్షలతో నిర్మించిన బస్ షెల్టర్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ పిన్నం బ్రహ్మయ్య, మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, మాజీ పీహెచ్‌సీ చైర్మన్ బి.రామకృష్ణ, యర్రబోతుల నేతాజీ, శ్రీనివాసరావు, పవన్‌కుమార్, శ్రీకాంత్, కాశీ రామారావు, రాధిక గుండా నరసింహారావు పాల్గొన్నారు.

నేడు చర్చి టవర్ పదో వార్షికోత్సవం



దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లి తెలుగు బాప్టిస్టు చర్చి టవర్ పదో వార్షికోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు పాస్టర్ తగరం ప్రేమయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెల్ టవర్ నిర్మాణం జరిగి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థన కూడిక ఏర్పాటు చేశామన్నారు. కలిదిండికి చెందిన దైవ సేవకులు బ్రదర్ జె.జాన్ ఆ ప్రార్థనల్లో పాల్గొని ప్రసంగిస్తారని వెల్లడించారు. అన్నదానం చేయనున్నట్లు చెప్పారు. చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

దాచేపల్లి: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం నడికుడి మార్కెట్ యార్డు సమీపంలో ఆదివారం గుర్తించారు. సుమారు 60 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి కాషాయం దుస్తులు ధరించి ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సౌందర్యరాజన్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 1720 ర్యాంక్



మధుసూదనరెడ్డి

నరసరావుపేట రూరల్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో మండలంలోని రంగారెడ్డిపాలేనికి చెందిన విద్యార్థి యేరువ మధుసూదనరెడ్డి ప్రతిభ చాటాడు. జాతీయస్థాయిలో 1720 ర్యాంక్, ఈడబ్ల్యూఎస్ విభాగంలో 153వ ర్యాంక్‌ను సాధించాడు. మధుసూదనరెడ్డి 10వ తరగతి వరకు పట్టణంలో, ఇంటర్మీడియెట్ విజయవాడలోని ప్రైవేటు కళాశాలలో విద్యనభ్యసించాడు. తల్లిదండ్రులు కష్టపడి వ్యవసాయం చేస్తూ తనను చదివించారని మధుసూదనరెడ్డి తెలిపాడు. చెన్నై ఐఐటీలో సీటు వస్తుందని భావిస్తున్నట్లు వివరించాడు. జేఈఈలో ఉత్తమ ర్యాంక్ సాధించిన మధుసూదనరెడ్డిని గ్రామస్తులు అభినందించారు.

ప్రపంచ ప్రార్థన దినోత్సవానికి సిద్ధం కండి

పాస్టర్ క్రిస్టర్

చిలకలూరిపేటటౌన్: ప్రతి ఉదయం 50 మంది దైవ సేవకులు దేశ ప్రజల క్షేమం కోసం చేస్తున్న ప్రార్థనలు సోమవారం ఉదయం పట్టణంలోని ఏసు క్రీస్తు దివ్యశాంతి నిలయంలో జరిగాయి. ఈ కార్యక్రమ నిర్వాహకులు పాస్టర్ ఎంఎన్ మూర్తి (సూరిబాబు) అధ్యక్షతన జరిగిన ప్రార్థనల అనంతరం పాస్టర్ ఎన్ క్రిస్టర్ ప్రసంగించారు. ఈస్టర్ నుంచి పెంతెకొస్తు ఆదివారం అయిన జూన్ 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న 50 రోజుల పాటు నిర్వహించే ఉదయకాల ప్రార్థనలు సోమవారం 44వ రోజుకు చేరుకున్నాయని తెలిపారు. జీయూపీఎఫ్, జేపీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం దేశంలో శాంతి, భద్రత కోసం చేసే ఈ ఉదయకాల ప్రార్థనలు ప్రతిరోజు ఒక చర్చిలో కొనసాగుతున్నాయన్నారు. మరో ఐదు రోజులు ఇలానే కొనసాగుతాయని, చివరిరోజైన 8వ తేదీన ప్రపంచ ప్రార్థన దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బస్టాండ్ ఎదుట ఉన్న పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో భారీగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ముగింపు ప్రార్థనలకు నియోజకవర్గంలోని క్రైస్తవులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.థామస్, అబ్రహాం, సంసోను, జి.బుజ్జి, కె.శాంతిసాగర్, కోటి వీరయ్య, క్రీస్తురాజు, డి.జీవరత్నం పాల్గొన్నారు.

క్వారీలో పడి వ్యక్తి మృతి

నాదెండ్ల: గణపవరం–వేలూరు వెళ్లే డొంక రోడ్డులో 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న క్వారీలో పడి గత నెల 26న వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటనలో మృతుడిని పోలీసులు గుర్తించారు. చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన మల్లా జెట్టియ్య (30) గత నెల 26 చేపలు పట్టేందుకు క్వారీ గుంత వద్దకు వచ్చి అందులో పడిపోయాడు. 29న అటుగా వెళ్తున్న స్థానికులు గుంతలో మృతదేహం తేలియాడుతున్న విషయాన్ని పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పోలీసులు వెలికితీసి చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసిన దర్యాప్తులో జెట్టియ్యగా గుర్తించారు. జెట్టియ్యకు ఫిట్స్ వచ్చి పడిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

పాటల పోటీలు నిర్వహించడం అభినందనీయం

- స్వరనీరాజనానికి విశేష స్పందన
- రెండు రోజుల పాటు సాగిన పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ మదార్ సాహెబ్, కొత్తమాసు శ్రీరామమూర్తి తదితరులు

మాచర్ల: గాన గంధర్వుడు డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకొని మాచర్ల పట్టణంలో డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కళాపరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఆదివారం నిర్వహించిన 'స్వరనీరాజనం' తెలుగు సినిమా పాటల పోటీలకు విశేష ఆదరణ లభించింది. జిల్లా స్థాయిలో వివిధ ప్రాంతాల నుంచి 150 మంది గాయకులు పాల్గొన్నారు. పోటీలు సోమవారం ఉదయం మూడు గంటల వరకు కొనసాగాయి. కార్యక్రమాన్ని డాక్టర్ ముటుకుల కమలాసన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాపరిషత్ అధ్యక్షుడు కొత్తమాసు శ్రీరామమూర్తి మాట్లాడుతూ పోటీలకు పెద్దసంఖ్యలో హాజరైనట్లు చెప్పారు. విజయవాడకు చెందిన ఎం.ఎస్.శివబాబుకు ప్రథమ బహుమతి కింద రూ.10 వేలు, వి.ఆనందరావుకు ద్వితీయ బహుమతి కింద రూ.7 వేలు, కె.ఎం.నాయుడుకు తృతీయ బహుమతి కింద రూ.5 వేలు, నాలుగో బహుమతి కింద బి.కోటేశ్వరరావుకు రూ.4 వేలు, ఐదో బహుమతి కింద వేజెండ్లకు చెందిన వెంకటేశ్వర్లుకు రూ.3 వేలు అందజేశారు. అదే విధంగా పోటీల్లో పాల్గొన్న 35 మంది గాయకులకు రూ.వెయ్యి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. లక్కీ డ్రా ద్వారా పది మంది మహిళలకు రూ.వెయ్యి ఖరీదు చేసే చీరలను అందించారు. కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన పది మంది విద్యార్థులకు కళా పరిషత్ తరఫున జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన మాచర్ల మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్ మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన కొత్త మాసు శ్రీరామమూర్తిని, ప్రధాన కార్యదర్శి మాగులూరి రాంబాబు, కోశాధికారి పఠాన్ జాన్ ఖాన్, జాయింట్ సెక్రెటరీ పులుసు శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యక్షులు బాహాటం శేషగిరి రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఓరుగంటి చెన్నకేశవరావు, కార్యవర్గ సభ్యులు కాశిబోయిన శివశంకర్,గట్ల కోటిరెడ్డిలను అభినందించారు. కార్యక్రమానికి ప్రత్తిగొడుపు నరసరాజు వ్యాఖ్యాతగా వ్యవహరించిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సీనియర్ జర్నలిస్ట్ ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు విద్యాధరణి మురళి పాల్గొన్నారు. కార్యక్రమంలో చుండూరు వెంకటేశ్వర్లు, కె.శాయి మార్కొండా రెడ్డి, చిన్న పత్రికల సంఘం రాష్ట్ర కోశాధికారి విద్యాధరణి నరసరాజు, కృష్ణవేణి జూనియర్ కాలేజ్, ఎస్వీఆర్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ యనమదల వెంకటరామయ్య, ఆక్స్‌ఫర్డ్ స్కూల్స్ మాజీ ప్రిన్సిపాల్, సైకాలజిస్ట్ ఎంబీఎస్ కోటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ పోలూరి నరసింహారావు, మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జున రావు పాల్గొన్నారు. పోటీలకు హైదరాబాద్‌కు చెందిన రాజగోపాల్, కల్యాణి, విశ్వేశ్వరరావు, గొట్టిపాటి రామారావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

రెంటాల లక్ష్మిచెన్నకేశవ స్వామి భూములు సర్వే



రెంటాల లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం భూములను సర్వే చేస్తున్న సర్వేయర్

రెంటచింతల: మండలంలోని రెంటాల లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం భూములను సర్వే చేయించినట్లు ఈఓ గాదె రామిరెడ్డి సోమవారం తెలిపారు. దేవస్థానానికి చెందిన 33.98 ఎకరాల భూములను, సర్వేయర్ రాజా నూతన సర్వే పరికరాలతో సర్వే చేసినట్లు చెప్పారు. దేవస్థానం భూములకు చుట్టు పక్కల భూముల రైతులకు సమాచారం ఇచ్చి వారి సమక్షంలో కొలిపించినట్లు తెలిపారు. దేవస్థానం భూములకు దారి చూపడంతో పాటు పక్క పొలంలో కలిసిన భూమికి హద్దులు గుర్తించడం జరిగిందన్నారు. అయితే 5.14 ఎకరాలు భూమి తేడా గర్తించినట్లు చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాలలో నున్న ఆలయాల భూములను కూడా సర్వే చేయించి పక్క పొలంలవారు కలుపుకున్న భూమిని స్వాధీనం చేసుకోనున్నట్లు తెలిపారు. సర్వేయర్ రాజా, నవులూరి చిన పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని నాణ్యంగా అందించాలి

ఎంఈఓ నాగేశ్వరరావు



బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ

నరసరావుపేట రూరల్: నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ఎంఈవో కె.నాగేశ్వరరావు తెలిపారు. లింగంగుంట్ల శంకర భారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో పట్టణ, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో నాగేశ్వరరావు మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని, వంట గది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. భోజన తయారీ తీసుకోవాల్సిన జాగ్రతలను తెలియజేశారు. ఈనెల నుంచి సన్న బియ్యాన్ని మధ్యాహ్న భోజన తయారీకి ప్రభుత్వం అందజేస్తున్నట్టు తెలిపారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న భోజనం తయారీదారులు, సహాయకులకు వంటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

తిరునాళ్లల్లో కళారూపాల ప్రదర్శన అభినందనీయం

విజేతలకు బహుమతులు అందజేత




విజేతలకు బహుమతులు అందజేస్తున్న గోపీచంద్, చినరామిరెడ్డి, మురళి

నరసరావుపేట: సమాజంలో మంచి, నీతిని పెంచి, చెడును, దుర్నీతిని తుంచి, శాంతి భద్రతలను కాపాడాల్సిన బాధ్యత పౌర సమాజం, ప్రభుత్వం పైన ఉందని, ఈ దిశలో కోటప్పకొండ లాంటి తిరునాళ్లలో కొన్ని నాటక కోలాటాల సమాజాలు చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం సాయంత్రం స్థానిక జిల్లా గ్రంథాలయ సంస్థ శాఖా గ్రంథాలయంలో మంచి చిత్రాల అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి 26న కోటప్పకొండ తిరుణాలలో మంచి కళారూపాలు ప్రదర్శించిన పలు సమాజాల నేతలకు అభినందన, సత్కారసభ నిర్వహించారు. స్థానిక ప్రజాకళా సంస్థల నేతలు చింతలచెర్వు అమరేంద్ర, శ్రీనాథ సాహితి పరిషత్ వ్యవస్థాపకులు స్వర్ణ చినరామిరెడ్డి, శ్రీ వాసవీ ఆర్యవైశ్య అన్నదాన కమిటీ కన్వీనర్ బత్తుల మురళి, విశ్రాంత ఉపాధ్యాయునులు కనగాల ఉదయలక్ష్మి, ఈదర నాగశిరోమణి ఈ సభలో బహుమతి ప్రదాతలుగా పాల్గొని దుశ్శాలువతో సత్కరించి, శతాబ్ది గాయకుడు ఘంటసాల వెయ్యి పేజీల, రూ.1600 విలువైన పాటల బృహత్ గ్రంథాలను ఆయా కళారూపాల పోటీ విజేతలకు అందజేశారు. నాయుడు విమల, జెట్టి పద్మ (కావూరు శ్రీ విఘ్నేశ్వర మురళీ మహిళా కోలాటం),113 తాళ్లూరు నుంచి గొట్టం ఆంజనేయులు (బ్రహ్మంగారి పూర్తి నాటకం), రొంపిచర్ల చక్రవరం రమేష్ రాజు (బ్రహ్మంగారి నాటకం, కోలాటం), కావూరు ఆంజనేయులు, సింగర కొండయ్య (కాకతీయ కళా వేదికపై పద్య నాటకాలు), కర్ణాటి కృష్ణమూర్తి (మంచి సినిమా పాటల కచేరి) ఈ సత్కారాలు అందుకున్న వారిలో ఉన్నారు. మంచి చిత్రాల అభిమాన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఈదర గోపీచంద్ సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ, గ్రామీణ జానపద కళలకు ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడిందని, మంచి కళలను, గ్రంథాలయాలను, పుస్తక పఠన సంస్కృతిని, పౌర సమాజాలే కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సంస్థ కోశాధికారి కాసు జోగిరెడ్డి తొలుత స్వాగతం పలికారు. కీ.శే. గుమ్మడి, రుద్ర రామారావులకు జోహార్లు ప్రకటించారు.

దోమలతో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పీహెచ్‌సీ వైద్యులు



ర్యాలీలో పీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బంది

క్రోసూరు: క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డాక్టర్ రాంబాబు నాయక్, డాక్టర్ సిరిచందన మాట్లాడుతూ దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇళ్లల్లో దోమలు ఉండేందుకు అవకాశాలున్న వాటిని తొలగించాలన్నారు. పాత టైర్లు, వాడి పడేసిన కొబ్బరి బొండాలు, వినియోగించని కుండలు, తొట్టెలు, పారని మురుగు లాంటివి గమనించుకుని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. దోమల బారిన పడకుండా దోమ తెరలు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసన్, మలేరియా సబ్ యూనిట్ అధికారి షేక్ బేగ్, సీహెచ్‌వో సాంబశివరావు, హెల్త్ సూపర్‌వైజర్ శివుడు, స్టాఫ్ నర్స్ అంజమ్మ ఫార్మసిస్ట్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు

సబ్సిడీపై పశువుల దాణా

అచ్చంపేట: పాల దిగుబడి పెంచేందుకు పాల ఉత్పత్తిదారులకు 50 శాతం సబ్సిడీపై పశువుల దాణాను మండలంలోని పలు గ్రామాలలో సోమవారం పంపిణీ చేసినట్టు పశు వైద్యాధికారి డాక్టర్ స్వాతీదేవి తెలిపారు. వేల్పూరు, కోనూరు, గ్రంథశిరి, చెరుకుంపాలెం, పుట్లగూడెం, చింతపల్లి, కొత్తపల్లి, చల్లగరిగ గ్రామాలలో పంపిణీ చేశామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పాల దిగుబడిని పెంచుకోవలసినదిగా డాక్టర్ స్వాతీదేవి సూచించారు.

కాగ్నిజెంట్‌లో ఉద్యోగాలకు 42 మంది ఎంపిక



నరసరావుపేట రూరల్: ప్రముఖ బహుళజాతి సంస్థ కాగ్నిజెంట్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 42 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్టు నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం నిర్వ హించిన కార్యక్రమంలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు అభినందించారు. కళాశాలలోని విద్యార్థులకు రెండవ సంవత్సరం నుంచి ప్రాంగణ ఎంపికలకు అవసరమైన కోడింగ్ శిక్షణ ఇస్తున్నట్టు కోటేశ్వరరావు తెలిపారు. కాగ్నిజెంట్ ఫేజ్–1 ఎంపికలో 37 మంది, ఫేజ్–2లో42 మంది విద్యార్థులతో మొత్తం 77 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు వివరించారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

డెప్యూటీ తహసీల్దార్ లక్ష్మీప్రసాద్



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): రేషన్ దుకాణాల ద్వారా అందించే నిత్యావసరాలు సక్రమంగా కార్డుదారులకు అందించాలని డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు చెప్పారు. మండలంలోని లంకెలకూరపాడు, గోళ్ళపాడు, చాగంటివారిపాలెం, ముప్పాళ్ళ గ్రామాల్లోని రేషన్ దుకాణాల ద్వారా జరుగుతున్న రేషన్ పంపిణీ ప్రక్రియను సోమవారం ఆయన తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా కార్డుదారులను పంపిణీ ఇబ్బందులపై ఆరా తీశారు. దుకాణదారులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. మండలంలో 32% రేషన్ పంపిణీ జరిగిందని, ప్రతి కార్డుదారునికి నిత్యావసరాలు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆయనతో పాటు ఆర్ఐ ఆంజనేయులు, ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు

సత్రశాల(రెంటచింతల): పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రజలు సహకరించాలని పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు అన్నారు. పరాశక్తి ఫ్యాక్టరీ ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సోమవారం నిర్వహించారు. అవగాహన ర్యాలీని ప్రారంభించారు. 4 రోజుల పాటు నిర్వహించనున్న పర్యావరణాన్ని కాపాడుకుందాం... ప్లాస్టిక్ వాడకాన్ని మానివేద్దాం అనే కార్యక్రమంపై ఉద్యోగులకు, కార్మికులకు ఆయన అవగాహన కల్పించారు. సమాజాన్ని పీడిస్తున్న ఈ ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించేందుకు మన వంతు కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ వస్తువుల ఉపయోగించడం వలన కలిగే నష్టాలను అవగాహన కలిగినప్పుడే వాటి వినియోగం తగ్గిపోతుందని చెప్పారు. ప్లాస్టిక్ వస్తువుల వాడక నిరోధకంపై ప్రజలలో చైతన్యం తీసుకురావాలని కోరారు. ప్రస్తుత సమాజంలో ప్రజలందరూ ఎక్కువగా ప్లాస్టిక్ వస్తువులను వాడుతుండటం కారణంగా వాతావరణం కాలుష్యంతో పాటు అనేక సమస్యలు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 3 నుంచి 5వ తేదీ వరకు ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాలలో ప్లాస్టిక్ వేస్ట్ తొలిగింపుతో పాటు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. అనంతరం ఉద్యోగులు, కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్లు ఎం.రామకృష్ణారెడ్డి, జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మళ్లీ వాయిదా పడిన మండల పరిషత్ సమావేశం

మాచర్ల రూరల్: మండల సర్వసభ్య సమావేశం మళ్లీ వాయిదా పడింది. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల పరిషత్ సమావేశం సభ్యులు హాజరు కాకపోవటంతో కోరం లేక వాయిదా వేశారు. మూడు సార్లుగా నిర్వహించిన సమావేశం కూడా ఇదే రీతిలో వాయిదా పడుతూ వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎంపీపీలపై పెత్తనం సాగించాలన్న ఆలోచన నేపథ్యంలో ఎంపీటీసీలకు ప్రాధాన్యం ఇవ్వకుండా అనాలోచిత ఆలోచనలతో చేపడుతున్న సమావేశాలకు స్థానిక ఎంపీటీసీలు హాజరుకావటం లేదు. దీంతో అధికారులు అభివృద్ధి పనులపై ఏం చేయాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. ఎంపీపీగా ఎంపికైన మంగమ్మ 11 నెలల క్రితం అనారోగ్యంతో సెలవుపై వెళ్లింది. వైస్ ఎంపీపీగా ఉన్న పోతురెడ్డి సుజాతకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వాలని ఎంపీటీసీ మెజార్టీ సభ్యులందరూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. అప్పటి జెడ్పీ సీఈఓ, కలెక్టర్లకు స్వయంగా కలిసి పత్రాలు అందజేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీపీలను ప్రభుత్వ ఉన్నతాధికారులు ఉత్తర్వులను జారీ చేయలేదు. దీంతో ఎంపీపీ లేక తరుచూ సమావేశాలు వాయిదా పడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు చేయాల్సిన తీర్మానాలు చేయలేక గ్రామాల్లో అభివృద్ధి పనులు ముందుకు పోక మండలం ఆర్థికంగా వెనుకబడుతుందని ఎంపీటీసీలు వాపోతున్నారు. దీని పై ఎంపీడీఓ ఫణీంద్ర కుమార్‌ను వివరణ కోరగా సభ్యులు హాజరు కాక, కోరం లేక వాయిదా వేస్తున్నాం. ఇన్‌చార్జి ఎంపీపీ కోసం మరోమారు ఉన్నతాధికారులకు నివేదిస్తున్నానని, తొందరల్లోనే ఇన్‌చార్జిపై ఆర్డర్ వచ్చే అవకాశం ఉందని చెప్పారు.

ప్రమాద బాధితులకు సాయం



బాధితులకు సాయం అందజేస్తున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్

మాచర్ల రూరల్: అగ్నిప్రమాద బాధితులకు గ్రామ పెద్దలు అండగా నిలిచి ఆర్థిక సాయాన్ని అందించటం అభినందనీయమని తహసీల్దార్ బి.కిరణ్ కుమార్ పేర్కొన్నారు. ఇటీవల మండలంలోని తాళ్లపల్లి గ్రామ శివారులో వీరాంజనేయపురంలో చెంచు కుటుంబాలకు చెందిన పూరి గుడిసెలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో సోమవారం తహసీల్దార్ బి.కిరణ్ కుమార్, గ్రామ పెద్దల సహకారంతో ఒక్కో కుటుంబానికి రూ.5 వేల నగదు, నిత్యావసరాలు అందజేశారు. ప్రభుత్వం నుంచి పక్కా గృహ నిర్మాణానికి చేయూతనిచ్చేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచి దేరంగుల కోటేశ్వరరావు, గ్రామస్తులు రామిశెట్టి సైదారావు, పసుపులేటి రోహిత్, నడ్డి పెద్దిరాజు, తీర్థాల ఈశ్వరయ్య, బిట్టు సత్యనారాయణ, కె.రామారావు, చింతకాయల ఆంజనేయులు, ఉప్పలపాటి శ్రీను, మాంగ్యానాయక్, వీఆర్ఓ జలీల్ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ

నరసరావుపేట: పల్నాడు జిల్లాలోని సమస్యాత్మక గ్రామాలు నాదెండ్ల మండలం కనపర్రు, రొంపిచర్ల మండలం తురుమెళ్ళ, నకరికల్లు మండలం చీమలమర్రి, గురజాల మండలం బోద వాడ, సత్తెనపల్లి పట్టణంలోని 22వ వార్డులో పోలీసు అధికారులు సోమవారం రాత్రి బసచేసి పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు గ్రామస్తులతో మాట్లాడి గ్రామ పరిస్థితులపై ఆరా దీశారు. ప్రస్తుత పరిస్థితులపై గ్రామ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా గొడవలకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళ్లినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు, మహిళలు, బాలబాలికలపై జరిగే నేరాలు, సైబర్ మోసాల బారిన పడకూడదని, అపరిచితుల కాల్స్, లింకులు క్లిక్ చేయరాదని, బ్యాంకు ఖాతాల ఓటీపీలు ఎవరికి చెప్పకూడదని ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930కి కాల్‌చేసి సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడిపే సమయంలో ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, తల్లిదండ్రులు మైనర్లకు ద్విచక్ర వాహనాలను ఎట్టి పరిస్థితులలో ఇవ్వకూడదని అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ప్రజలకు అవగాహన చేస్తున్నారు. గ్రామాలలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూసుకునే బాధ్యత పోలీసు అధికారులకు ఉంటుందని, అందుకోసం గ్రామాలలోని ప్రజలు తమవంతు బాధ్యతగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు గ్రామాల్లోని యువత, ప్రజలు పోలీసులకు సహకరించాలని తెలియజేశారు. గ్రామాలలో ఎటువంటి చిన్న సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని, పేకాట, నాటు సారా, అక్రమ మద్యం విక్రయాలు జరుగుతుంటే తమ దృష్టికి తీసుకొని వస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తి యాప్ డౌన్‌లోడు చేసుకొని వారి ఏమైనా ఇబ్బంది ఉంటే తెలియజేయాలని తెలిపారు. పల్లెనిద్ర కార్యక్రమంలో నకరికల్లు, రొంపిచర్ల, గురజాల, సత్తెనపల్లి, నాదెండ్ల ఎస్ఐలు ఎస్ఐ సురేష్ బాబు, పనికృష్ణ, వినోద్, పవన్ కుమార్, పుల్లారావు పాల్గొన్నారు.

ఘనంగా వల్లభేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మన్మహా మల్లేశ్వర మహాదేవర (శ్రీ వల్లభేశ్వరస్వామి) స్వామి ఆలయ 7వ వార్షికోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉద యం నుంచే ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభించారు. విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో మల్లిశెట్టి అనూషా నాయిడు శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. వందలాది మంది భక్తులు ఆలయాన్ని సందర్శించి స్వామి వారికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సభ్యులు ఏర్పాట్లను పరివేక్షించారు.

ఘనంగా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ వార్షిక వేడుకలు



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో వేంచేసి ఉన్న గంగా అన్నపూర్ణా సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ వార్షిక వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 8వ వార్షిక వేడుకలు పురస్కరించుకొని ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రదక్షిణం, గణపతిపూజ, పుణ్యాహవాచనం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, చండీ పారాయణం, రుద్రహోమం అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. స్వామి వారిని, అమ్మవారిని విశేషంగా అలంకరించారు.
వార్షిక వేడుకల సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. మూడురోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తామని మూడవ రోజు బుధవారం అన్నదాన కార్యక్రమం, విశేష పూజలు ఉంటాయని అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు తెలిపారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు వంటల పోటీలు



నకరికల్లు: పరిశుభ్రమైన, నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు వడ్డించాలని రిసోర్స్ పర్సన్ రమాదేవి అన్నారు. పీఎం పోషణ-డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు స్థానిక ఎంపీపీ మెయిన్ పాఠశాలలో సోమవారం శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం వండే పాత్రలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాజా కూరగాయలు, వంట సామగ్రి వాడాలన్నారు. మెనూను కచ్చితంగా అమలు చేయాలన్నారు. విద్యార్థులకు పోషకాహారాన్ని అందించడంలో నిబంధనలు పాటించాలన్నారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించి పరిశుభ్రత, రుచి ఆధారంగా విజేతలను ఎంపిక చేసి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మేదరమెట్ల స్వామి, మండల కో ఆర్డినేటర్ బత్తిన మల్లిఖార్జునరావు, కంప్యూటర్ ఆపరేటర్ ఎస్.అంజమ్మ, సీఆర్‌పీలు పాల్గొన్నారు.